సాక్షి నల్లగొండ

బుధవారం ၊ 17 ၊ మే ၊ 2023



గంజాయి ముఠా అరెస్టు

గంజాయి తరలిస్తున్న అంతరాష్ట్ర ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. - 8లో



ఎయిమ్స్‌లో యోగా వేడుకలు

బీబీనగర్‌లోని ఎయిమ్స్‌లో యోగా వేడుకలను డైరెక్టర్ వికాస్ భాటియా ప్రారంభించారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం 44°/30°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు పాలీసెట్

రామగిరి(నల్లగొండ) : పాలీసెట్ – 2023 బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్, నల్లగొండ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.జానకిదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రం లో 10 కేంద్రాల్లో 4,402 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులకు గంట ముందే చేరుకోవాలని సూచించారు. నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోని అనుమతించరని పేర్కొన్నారు.

ఎన్జీ కళాశాలకు జిజ్ఞాస బహుమతులు



మొదటి బహుమతి అందుకుంటున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

రామగిరి(నల్లగొండ) : జిజ్ఞాస రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎన్జీ కళాశాల ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్లు బహుమతులు సాధించాయి. మంగళవారం హైదరాబాద్ సిటీ కాలేజీలో జిజ్ఞాస విజేతలకు బహుమతుల ప్రధానం జరిగింది. ఈ సందర్భంగా ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌కు మొదటి బహుమతిగా రూ.30 వేలు, కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్‌కు తృతీయ బహుమతిగా రూ.12 వేలు, జ్ఞాపిక, ప్రశంస పత్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్, అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, తౌసీఫ్, విద్యార్థులు అందుకున్నారు. బహుమతులు అందజేసిన వారిలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, కళాశాలల విద్యా కమిషనరేట్ జేడీ యాదగిరి, రాజేందర్ సింగ్ తదితరులు ఉన్నారు.

కుంకుడుచెట్టుతండా సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

పెద్దవూర: మండలంలోని కుంకుడుచెట్టుతండా సర్పంచ్ ప్రియాంక చెక్‌పవర్‌ను డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు రద్దు చేసినట్లు ఎంపీడీఓ కూన్‌రెడ్డి విజయాకుమారి మంగళవారం తెలిపారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు అభియోగాలు రావడంతో పూర్తి విచారణ చేపట్టిన అనంతరం సర్పంచ్ ప్రియాంక చెక్‌పవర్‌ను రద్దు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు చెక్కులపై సంతకాలు చేయకుండా నానా ఇబ్బందులకు గురి చేస్తూ ఆమె తండ్రి చందూనాయక్ చేతుల మీదుగా విధులు నిర్వర్తిస్తున్నట్లు డీపీఓకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో పూర్తిస్థాయి విచారణ చేపట్టిన అధికారులు అభియోగాలు నిర్ధారణ కావడంతో ఆమె చెక్‌పవర్‌ను రద్దు చేసినట్లు వెల్లడించారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని నర్సింగ్ బట్ల గ్రామంలో మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సింగ్ బట్ల గ్రామంలో ఏర్పాటు చేయనున్న మైనింగ్ స్థలాన్ని సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ మైనింగ్ ఏర్పాటు చేస్తే సమీప రైతులకు పంట నష్టం, జల కాలుష్యం, అనారోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రవన్‌కుమార్, నర్సింహ, వెంకటేశ్వర్లు, కాంతయ్య, అశోక్ పాల్గొన్నారు.

30న మాజీ ప్రజాప్రతినిధుల మహాసభ

నల్లగొండ : మాజీ ప్రజాప్రతినిధుల 4వ మహాసభ ఈ నెల 30న నల్లగొండలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి శంకర్, ఉపాధ్యక్షుడు రహీం, జిల్లా కన్వీనర్ సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, వీరెల్లి చంద్రయ్యలు తెలిపారు. మంగళవారం ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌ను కలిసి మహాసభకు రావాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు పెన్షన్ విధానం అమలు చేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వడంతోపాటు ఆర్టీసీ చార్జీల్లో రాయితీ ఇవ్వాలని, డబుల్ బెడ్‌రూం లేదా ప్రభుత్వం అమలు చేయబోయే రూ.3 లక్షల స్కీంలో అవకాశం కల్పించాలని కోరారు.

మీటర్ తిరుగుడే..



మండుతున్న ఎండలు.. పెరిగిన విద్యుత్ వినియోగం

- 45 డిగ్రీలకు చేరుకున్న గరిష్ట ఉష్ణోగ్రతలు
- పెద్ద ఎత్తున్న పెరిగిన ఏసీలు, కూలర్ల వాడకం
- 15 రోజుల్లోనే 5,248 మెగావాట్ల విద్యుత్ వినియోగం



నల్లగొండలో కూలర్ల షాపు వద్ద కొనుగోలుదారులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో భానుడు ఉగ్రరూపం చూపుతున్నాడు. మండుతున్న ఎండలను తట్టుకునేందుకు ప్రజలు చల్లదనం కోసం ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఇళ్లల్లో విద్యుత్ వినియోగం పెద్ద ఎత్తున పెరిగింది. రోజూ 350 మెగావాట్లకు పైగా విద్యుత్ వినియోగం జరుగుతోంది. ఓ పక్క గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరుకోవడంతో అదే స్థాయిలో విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 5,248 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగింది.

మే రెండో వారం నుంచి..

జిల్లాలో ఈసారి ఎండలు మండిపోతున్నాయి. మార్చి నెలలోనే 34 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆ తర్వాత ఏప్రిల్‌లో మొదటి రెండు వారాల్లోనే 40 డిగ్రీలకు చేరడంతో ప్రజలు తట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఏప్రిల్‌లోనే ఆ స్థాయిలో ఎండలు ఉండటంతో ప్రజలు ఈసారి ఎండలు విపరీతంగా ఉంటాయనే అంచనాకు వచ్చారు. ఏప్రిల్ 20 నుంచి అకాల వర్షాలు పడ్డాయి. దీంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అయితే వాతావరణం కొంత చల్లబడటంతో మే మొదటి వారం వరకు ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఆ తరువాత భానుడు ప్రతాపం తన ప్రతాపాన్ని చూపుతుండటంతో ప్రజలు ఎండలకు ఇబ్బందులు పడక తప్పడంలేదు.

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..

ఈ నెల మొదటి వారం తర్వాత ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగాయి. మే 9వ తేదీన 40 డిగ్రీలకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు చేరుకున్నాయి. 10వ తేదీన 41 డిగ్రీలు నమోదుకాగా 11వ తేదీన 41.5 డిగ్రీలు, 12వ తేదీన 42 డిగ్రీలు, 13వ తేదీన 43.5 డిగ్రీలు, 14వ తేదీన 43.4 డిగ్రీలు, 15వ తేదీన 43.5 నమోదు కాగా 16వ తేదీన 43.5గా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇలా రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలు వేడిని తట్టుకోలేక ఏసీలు, కూలర్లను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగిపోయింది.

విద్యుత్ వినియోగం ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం 761 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగించారు. గత ఏడాది మే 16వ తేదీన 747 మెగావాట్ల విద్యుత్ వినియోగించారు. ఈసారి అది భారీగా పెరిగింది. ఈనెల 15వ తేదీన కూడా 755 మెగావాట్ల విద్యుత్‌ను ఉమ్మడి జిల్లా ప్రజలు వినియోగించారు. ఒక్క నల్లగొండ జిల్లాలో చూస్తే ఈనెల 1వ తేదీన 313 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగించగా ఈనెల 15వ తేదీ నాటికి అది 362 మెగావాట్లకు పెరిగింది. 15 రోజుల్లో 49 మెగావాట్ల విద్యుత్ అదనంగా వినియోగించారు. ఈనెల 8వ తేదీన 407 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగింది.

జిల్లాలో మే 1 నుంచి విద్యుత్ వాడకం (మెగావాట్లలో..)

తేదీ	వినియోగం	తేదీ	వినియోగం
1	313	8	407
2	308	9	304
3	329	10	379
4	338	11	387
5	350	12	353
6	398	13	351
7	331	14	338
		15	362

మొత్తం 5,248

ఉక్కపోత ఎక్కువైంది



ఎండలు బాగా పెరిగాయి. వేడికి తట్టులేకపోతున్నాం. ఇంట్లో కూడా ఉక్కపోత ఎక్కువైంది. అందుకే కూలర్ కొనుగోలు చేశాం.

– విజయలక్ష్మి

కూలర్ల అమ్మకాలు పెరిగాయి



వారం రోజుల నుంచి ఎండల తీవ్రత పెరగడంతో కూలర్లకు గిరాకీ పెరిగింది. పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. అకాల వర్షాల కారణంగా 20 రోజులపాటు కూలర్ల గిరాకే లేదు. వారం రోజుల నుంచి మళ్లీ ఎండలు పెరగడంతో రోజు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. రోజుకు 30 కూలర్ల పైచిలుకే అమ్ముతున్నాం.

– షరీఫ్, కూలర్ల షాపు యజమాని

మంగళవారం జిల్లాలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు..

దామరచర్ల 45.1, తిప్పర్తి 44.5, పెద్దవూర 44.2, మిర్యాలగూడ 43.8, నిడమనూర్ 43.8, నల్లగొండ 43.5, నకిరేకల్ 43.2, అనుముల 43.0, కేతేపల్లి 43.0, కట్టంగూర్ 42.7, త్రిపురారం 42.4, గుర్రంపోడు 42.4, చందంపేట 42.3, అడవిదేవులపల్లి 42.3, వేములపల్లి 42.2, కొండమల్లేపల్లి 42.1, నేరడుగొమ్ము 42.1, మాడ్గులపల్లి 42.0, కనగల్ 41.9, నాంపల్లి 41.6, తిరుమలగిరి సాగర్ 41.6, శాలిగౌరారం 41.1, దేవరకొండ 41.1, చిట్యాల 40.9, నార్కట్‌పల్లి 40.5, మర్రిగూడ 40.3, చింతపల్లి 40.2 డిగ్రీలుగా నమోదైంది.

నకిలీ విత్తనాలను అరికడతాం

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎస్పీ అపూర్వరావు తదితరులు

నల్లగొండ : జిల్లాలో నకిలీ విత్తనాలను అరికడతామని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి.. రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాలను చెలామణి కాకుండా అరికట్టడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తామన్నారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు ద్వారా ప్రతిరోజు తనిఖీలు నిర్వహిస్తామన్నారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి ఎస్పీ అపూర్వరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, డీఏఓ సుచరిత తదితరులు పాల్గొన్నారు.

నక్కలగండి ప్రాజెక్టును పూర్తి చేయాలి



నక్కలగండి ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చందంపేట : నక్కలగండి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కేతావత్ లాలునాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ నాయకుల బృందం మండలంలోని నక్కలగండి ప్రాజెక్టును సందర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21న కేంద్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి మహేంద్రనాథ్‌పాండే నక్కలగండి ప్రాజెక్టును సందర్శిస్తారని తెలిపారు. అనంతరం నేరెడుగొమ్ము మండలంలోని గుర్రపుతండాలో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెనమోని రాములు, ఏటి.కృష్ణ, నర్సింహ, పాత్లావత్ ఆంజనేయులు, బహదూర్ సింగ్, సాగర్, అంజయ్య తదితరులున్నారు.

22న కేంద్ర మంత్రి సమావేశం

మిర్యాలగూడ టౌన్ : వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు, ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండేతో మిర్యాలగూడలో సమావేశం ఏర్పాటు చేసినట్లు రానున్నారని బీజేపీ నల్లగొండ పార్లమెంట్ ప్రభారి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక బృందావన్ గార్డెన్‌లో నిర్వహించిన బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బాణావత్ రతన్‌సింగ్‌నాయక్, అసెంబ్లీ ప్రభారి గోగిరెడ్డి లచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నేత సాధినేని శ్రీనివాస్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్, సీనియర్ నేత బంటు సైదులు, పట్టణ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు చలమల సీతారాంరెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి తెలంగాణలో స్థానం లేదు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి

మిర్యాలగూడ : దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీకి తెలంగాణలో చోటు లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక ప్రజలు తెలివితో ఓటు ద్వారా బీజేపీకి బుద్ధి చెప్పారని.. ఆ ఫలితాలు దేశవ్యాప్తంగా రాబోతున్నాయని జోస్యం చెప్పారు. లౌకిక పార్టీలతో కలిసి దేశ వ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, కందాల ప్రమీల, పాలడుగు ప్రభావతి, పాలడుగు నాగార్జున, ఎండీ.హాసం, బండ శ్రీశైలం, కూన్‌రెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైసలిస్తేనే ఫైల్ కదులుతది!

- గట్టుప్పల తహసీల్దార్ కార్యాలయంలో వసూళ్ల పర్వం
- ప్రతి పనికి ఓ రేటు చొప్పన సిబ్బంది డిమాండ్
- సర్టిఫికెట్ల జారీకి రోజుల తరబడి తిరుగుతున్న దరఖాస్తుదారులు





ఈ ఫొటోలోని మహిళ పేరు మాడ్గుల ధనమ్మ. ఈమెది గట్టుప్పల మండలం తేరట్‌పల్లి గ్రామం. ధనమ్మ మామ మాడ్గుల రాములు గతేడాది మృతిచెందాడు. రాములు డెత్ సర్టిఫికెట్ కోసం ధనమ్మ భర్త మాడ్గుల సత్తయ్య 07–12–2022వ తేదీన మీసేవలో దరఖాస్తు చేసి, గట్టుప్పల తహసీల్దార్ కార్యాలయంలో ఆ దరఖాస్తును అందజేశాడు. విచారణ సమయంలో (విచారణ అధికారికి) కొంత నగదు ముట్టజెప్పాడు. కానీ ఇప్పటి వరకు డెత్ సర్టిఫికెట్ జారీ కాలేదు. సత్తయ్యకు ఇటీవల ఆరోగ్యం బాగా లేకపోవడంతో తన మామ డెత్ సర్టిఫికెట్ కోసం ధనమ్మ కార్యాలయం చుట్టూ తిరుగుతోంది. సంబంధిత అధికారులు అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. ఇదీ గట్టుప్పల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు తీరుకు నిదర్శనం.

చండూరు: గట్టుప్పల తహసీల్దార్ కార్యాలయంలో ఏ పని కావాలన్నా పైసలు ముట్టజెప్పాల్సిందే. కాసులిస్తేనే ఫైల్స్ కదులుతున్నాయి. ఆ కార్యాలయం బాస్‌కు తెలియకుండా కిందిస్థాయి సిబ్బంది అందిన కాడికి దండుకుంటున్నారు. దీంతో పనుల కోసం ఆ కార్యాలయానికి రావడానికి జనం జంకుతున్నారు. కొందరు పైసలు ముట్టజెప్పినా సదరు సిబ్బంది పని చేయకుండా తిప్పుకుంటున్నారు. ఇక, అడిగినంత ఇవ్వకుంటే ఎన్నిసార్లు తిప్పుతారోనని మండలవాసులు ఆందోళన చెందుతున్నారు. అసలు ఈ కార్యాలయంలో ఎవరికి ఏ సెక్షన్ కేటాయించారో కూడా అర్థం కాదు. ఏ పని కోసం వెళ్లినా.. ఎవ్వరిని కలిసినా సరే చేస్తాను కానీ! అనే మాటే వినబడుతుంది. వీరు చేస్తున్నది అంతా పైఅధికారి (తహసీల్దార్)కి తెలియకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలిసింది.

రూ.3 వేలు ముట్టజెప్పాల్సిందే..

గట్టుప్పల తహసీల్దార్ కార్యాలయంలో ఎటువంటి సర్టిఫికెట్ కావాలన్నా రూ.2 వేల రూ.3 వేల వరకు ముట్టజెప్పాల్సి రావడం బహిరంగ రహస్యం. మండలం పరిధిలో ఓ గ్రామానికి చెందిన ఓ రైతు ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం రెండు వేలు ఇచ్చి రెండు నెలలుగా, మండల కేంద్రానికి చెందిన ఓ చేనేత కార్మికుడు ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం రెండు నెలలుగా, ఓ నిరుపేద చేనేత కార్మికుడు ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం నెల రోజులుగా.. తిరుగుతూనే ఉన్నారు.

జిల్లా కార్యాలయానికి సరెండర్ చేస్తా

కార్యాలయంలో లంచాల పర్వం నా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటా. పనుల కోసం వచ్చే ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని గతంలో అనేసార్లు మా సిబ్బందిని హెచ్చరించా. లంచం అడిగే అధికారులను జిల్లా కార్యాలయానికి సరెండర్ చేస్తా. కార్యాలయంలో ఎవరు లంచం అడిగినా నాకు నేరుగా తెలియజేయండి. భయపడాల్సిన అవసరం లేదు.

– డి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్, గట్టుప్పల

11.93 లక్షల ఎకరాల్లో సాగు

వానాకాలం సాగు ప్రణాళిక ఖరారు

- అత్యధికంగా 6.50 లక్షల ఎకరాల్లో పత్తి, 5.25 లక్షల ఎకరాల్లో వరి
- ఈ సారి అపరాల సాగు పెంచేందుకు కసరత్తు
- విత్తనాలు, ఎరువుల కోసం వ్యవసాయశాఖ ప్రతిపాదనలు



నల్లగొండ అగ్రికల్చర్ : వానాకాలం సీజన్ సాగు ప్రణాళికను జిల్లా వ్యవసాయ శాఖ ఖరారు చేసింది. గత వానాకాలంలో 11,54,286 ఎకరాల్లో వరి, పత్తి ఇతర పంటలను సాగు చేశారు. ప్రస్తుతం రానున్న వానాకాలంలో 11లక్షల 93 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. దానికి అనుగుణంగా విత్తనాలు, ఎరువుల కోసం రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కార్యాలయానికి నివేదించింది.

గతేడాది కంటే ఎక్కువే..

గత వానాకాలంలో పత్తి 6,45,773 ఎకరాల్లో సాగు కాగా ప్రస్తుత సీజన్‌లో 6లక్షల 50 వేల ఎకరాల్లో సాగు చేయనున్నట్లు అంచనాలు వేసింది. వరి గత వానాకాలంలో 5,04,207 ఎకరాల్లో సాగు చేయగా ప్రస్తుత సీజన్‌లో 5లక్షల 25 వేల ఎకరాల్లో, కంది గత సీజన్‌లో 3,273 ఎకరాలలో సాగు కాగా ప్రస్తుతం 10 వేల ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. ప్రస్తుత సీజన్‌లో అపరాల సాగును పెంచాలని భావిస్తోంది. వేరుశగన 3 వేలు, ఇతర అపరాలు 5 వేల ఎకరాల్లో సాగు చేయించాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఇందుకోసం రైతులకు అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతోంది.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

వానాకాలం సీజన్‌కు అవసరమైన విత్తనాలు ముందస్తుగా రైతులకు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ ప్రణాళిక రూపొందించింది. పత్తి విత్తనాలు 14.5 లక్షల ప్యాకెట్లు (450 గ్రాములు), వరి (ఎంటీయూ 1010, బీపీటీ–5204, ఆర్‌ఎన్‌ఆర్ 15048, జేజీఎల్) రకాలు 86,450 క్వింటాళ్లు అవసరంగా గుర్తించి ప్రభుత్వానికి నివేదించింది. కంది 600 క్వింటాళ్లు, పెసర 400 క్వింటాళ్లు, వేరుశగన 1000 క్వింటాళ్లు అవసరంగా గుర్తించింది. ఇప్పటికే జిల్లాలో పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి విత్తనాలు అందుబాటులో ఉంచారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం



వానాకాలం సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువుల కోసం ముందుగానే రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు నివేదించాం. ఎక్కడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండదు. రైతులు కూడా నకిలీ విత్తనాలపై జాగ్రత్తలు తీసుకోవాలని. నకిలీ విత్తనాలను అరికట్టడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– వై.సుచరిత, డీఏఓ

ఎరువులకు ప్రతిపాదనలు

ప్రస్తుత వానాకాలం సీజన్‌కు అవసరమైన ఎరువుల కోసం ప్రతిపాదనలు పంపింది. యూరియా 80,108 మెట్రిక్ టన్నులు, డీఏపీ 14,377 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 1,09,379 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 11,745 మెట్రిక్ టన్నులు అవసరంగా గుర్తించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. అయితే ప్రస్తుతం జిల్లాలో యూరియా 27,462 మెట్రిక్ టన్నులు, డీఏపీ 4,544 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 27,183 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 1578 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



ఆంజనేయస్వామికి పూజ చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఇష్టమైన రోజు కావడంతో ఆచార్యులు ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంజనేయస్వామిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. అనంతరం అంజనీపుత్రుడికి ఇష్టమైన నైవేద్యాన్ని ఆరగింపు పెట్టారు. ప్రధానాలయంలో, విష్ణు పుష్కరిణి, అనుబంధ ఆలయాలైన శివాలయం, పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాల వద్ద ఉన్న ఆంజనేయస్వామికి భక్తులు పూజలు చేశారు. ఇక ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి.

అణగారిన వర్గాల గొంతుక వీరన్న



వీరన్న ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ : ఇండియా విప్లవోద్యమానికి దిశా నిర్దేశం చేసిన మార్గనిర్దేశకుడు, పీడితుల గొంతుక మారోజు వీరన్న అని తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద మారోజు వీరన్న చిత్రపటానికి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ వీరన్న పోరాటమే జీవితంగా బతికాడని చెప్పారు. ఆనాడు ముఖ్యమంత్రి ఎన్.జనార్దన్‌రెడ్డి చేత రాజీనామా చేయించిన ఘనత వీరన్నదని పేర్కొన్నారు. ఇండియాలో సమస్యలన్నింటికీ కులమే కారణమని కుల ఎజెండాను లేవనెత్తి అణగారిన కులాలన్నింటినీ ఒక్క తాటిపైకి తెచ్చి రాజ్యాధికారం వైపు ఉద్యమించిన నేత వీరన్న అని కొనియాడారు. వీరన్న చూపిన మార్గంలో అనగారిన కులాలను ఏకం చేస్తూ అస్తిత్వ ఉద్యమాలను నడుపుతూ రాజ్యాధికారం దిశగా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. వీరన్న పోరాట చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని, ట్యాంక్ బండ్‌పై మారోజు వీరన్న విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి బకరం శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఐతగోని జనార్దన్‌గౌడ్, తెలంగాణ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొండేటి మురళి, మానుపాటి భిక్షమయ్య, యాదగిరియాదవ్, నారబోయిన రాజు, వలసాల శివ, మధు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిమ్మతోట దగ్ధం



కరివిరాలలో దగ్ధమైన నిమ్మతోట

నడిగూడెం : ఈదురుగాలులకు విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తగిలి నిప్పురవ్వలు చెలరేగడంతో ఓ నిమ్మతోట దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం మండలంలోని కరివిరాల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఆవుల ఉపేందర్ నిమ్మతోటపై నుంచి వెళ్లిన విద్యుత్ తీగలు ఈదురుగాలులకు ఒకదానికి ఒకటి తగలి నిప్పురవ్వలు రావడంతో మంటలు ఎగిసిపడి దాదాపు 100నిమ్మచెట్లకు పైగా దగ్ధమయ్యాయి. దీంతో రూ.3లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఉపేందర్ వాపోయాడు. అధికారులు తోటను పరిశీలించి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మంటలు అంటుకుని వృద్ధుడు మృతి



గంగయ్య(ఫైల్)

గరిడేపల్లి : వరికొయ్యలకు పెట్టిన మంటలను ఆర్పే ప్రయత్నంలో మంటలు చుట్టు ముట్టి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని అప్పన్నపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోళ్ల గంగయ్య(60) పొలం పక్కన ఉన్న వారు వారి పొలంలో వరికొయ్యలకు నిప్పుపెట్టారు. ఆ మంటలు వ్యాపించుకుంటూ తన పొలంలోని వాటర్ పైపులకు మంటలు అంటుకుంటాయనే ఉద్దేశంతో చెట్ల కొమ్మలతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మంటలు గంగయ్య చుట్టూ వ్యాపించడంతో ఆ మంటల్లోనే పడి కాలిపోయాడు. మృతుడి భార్య గోళ్ల వీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

మహిళ ఆత్మహత్య

చింతపల్లి : జీవితంపై విరక్తి చెంది ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మంగళవా రం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వింజమూరు గ్రామానికి చెందిన మల్లం వెంకటమ్మ(48) జీవితంపై విరక్తి వస్తుందని పలుమార్లు చనిపోతానని కుటుంబ సభ్యులతో అంటుండేది. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం 11గంటల సమయంలో పశువులను మేపేందుకు వెళ్లి సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు వెంకటమ్మ ఆచూకీ కోసం వెదికారు. ఎక్కడ ఆచూకీ లభ్యం కాకపోవడంతో అనుమానం వచ్చి మంగళవారం ఉదయం చింతపల్లి సమీపంలో ప్రాజెక్టు కాలువ వద్ద వెదకగా రాళ్లు కట్టుకొని కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు వీరమళ్ల చినవెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

12క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

డిండి : అక్రమంగా ఓ ఇంట్లో నిల్వఉంచిన 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ.సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. చందంపేట మండలంలోని ముదుదండ్ల గ్రామానికి చెందిన దామెర వెంకటేశ్వర్లు మండల పరిధిలోని ఎర్రారం గ్రామంలోని గోరటి ఎల్లమ్మ ఇంటిని అద్దెకు తీసుకొని పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచాడు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి 12క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని నిందితుడు వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంతరాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

- రూ.10లక్షల విలువైన గంజాయి స్వాధీనం
- కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద తనిఖీలో పట్టుబడిన నిందితులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అపూర్వరావు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అపూర్వరావు, పక్కన పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు

నల్లగొండ క్రైం : ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గుట్టు చప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న అంతరాష్ట్ర ముఠా సభ్యులను జిల్లా పోలీసులు మంగళవారం పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో కేతేపల్లి మండలంలోని జాతీయ రహదారి 65పై కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద మండల పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పలువురు వ్యక్తులు ఓ బస్సులో నుంచి దిగి వారి వద్ద ఉన్న బ్యాగులతో పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు పట్టుకొని బ్యాగులు తనిఖీ చేయగా గంజాయి లభించింది. ఈ కేసుకు సంబంధించి మంగళవారం ఎస్పీ అపూర్వరావు పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. టాస్క్ ఫోర్స్, కేతేపల్లి పోలీసులు సంయుక్తంగా హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలను తనిఖీ చేయగా ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి సరఫరా చేస్తున్న 5గురు వ్యక్తులతో పాటు మరో మహిళ పట్టుబడింది. ఒడిషాలోని మల్కాంగిరి నుంచి గంజాయిని హైదరాబాద్‌కు, మధ్యప్రదేశ్‌కు సరఫరా చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 5సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మల్కాంగిరికి చెందిన గంజాయి వ్యాపారి వినయ్ హైదరాబాద్‌కు చెందిన వివేక్‌కు గంజాయి అందజేసేందుకు ఒకొ క్కరికి రూ.10వేలు, ప్రయాణఖర్చులు గంజాయి వ్యాపారి ఇస్తున్నట్లు తెలిపారు. మల్కాంగిరికి చెందిన మరో వ్యాపారి జీవన్‌సింగ్ గంజా యిని కొని హైదరాబాద్‌లో తెలిసిన వ్యక్తులకు చిన్న పొట్లాలు చేసి విక్రయించడంతోపాటు మధ్యప్రదేశ్ కు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఎక్కువ లా భం వస్తుందని గంజాయి వ్యాపారాన్ని ఎంచుకున్నారని పట్టుబడిన వారిలో ఒడిషాలోని పోడియ జిల్లా మల్కాంగిరికి చెందిన అశోక్ తారఫ్దర్, అదే ప్రాంతానికి చెందిన ఫణి తారాఫ్దర్, అదే ప్రాంతానికి చెందిన ధనుజయ్ బిశ్వాస్, అదే ప్రాంతానికి చెందిన శిఖా బిశ్వాస్, మధ్యప్రదేశ్‌లోని శాజాపూర్ జిల్లాలోని అగర్‌మాల్వా మండల కేంద్రానికి చెందిన జీవన్‌సింగ్ యాదవ్‌లు పట్టుబడ్డారు. ఒడిషా లోని జగ్దల్పూర్‌కు చెందిన వినయ్, హైదరాబాద్‌కు చెందిన వివేక్‌లు పరారీలో ఉన్నట్లు తెలి పారు. కేసును పరిశోధించిన పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో శాలీగౌరారం సీఐ రాఘవరావు, కేతేపల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి, కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు, కిశోర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి



బాలకృష్ణారెడ్డి (ఫైల్)

మఠంపల్లి : రోడ్డు ప్రమాదంలో ఎన్‌సీఎల్ పరిశ్రమ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నాగార్జున సిమెంట్స్ పరిశ్రమ సమీపంలో మట్టపల్లి -హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చౌటపల్లికి చెందిన కొండేటి బాలకృష్ణారెడ్డి (35) కొన్నేళ్లుగా స్థానిక ఎన్‌సీఎల్ పరిశ్రమలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ పరిశ్రమ కాలనీలోనే భార్యా పిల్లలతో ఉంటున్నాడు. బాలకృష్ణ మంగళవారం స్వగ్రామమైన చౌటపల్లికి తన మోటార్‌బైక్ వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి తిరిగి పరిశ్రమకు వస్తున్నాడు. ఈ క్రమంలో పరిశ్రమకు కూతవేటు దూరంలోనే ప్రధాన రహదారిపై వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతడు బైక్‌తో సహా రోడ్డువెంట కంపచెట్ల పొదల్లో పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే పరిశ్రమ వాహనంలో చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి సోదరుడు నాగార్జునరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆస్పత్రిలోనే గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



మృతి చెందిన గుర్తు తెలియని యువకుడు

చిట్యాల : మండలంలోని పెద్దకాపర్తి గ్రామశివారులోని జాతీయ రహదారిపై హోటల్-7 సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ యువకుడి వివరాలు తెలియరాలేదు. ఆ యువకుడు విజయవాడ నుంచి హైదరాబాద్ వైపుకు వెళ్తున్న ఓ కారును లిఫ్ట్ అడిగి ఎక్కాడు. కాగా ఆ కారు పెద్దకాపర్తి శివారులో రోడ్డు ప్రమాదానికి గురవగా ఆ కారులో వెనక సీట్లో కూర్చున్న గుర్తు తెలియని యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. దీంతో యువకుడి మృతదేహాన్ని నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచారు. మృతుడి వయస్సు సుమారు 26ఏళ్లు ఉండగా, ఒంటిపై గోధుమ రంగు గీతలుఉన్న షర్ట్, నల్ల ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడిని గుర్తించిన వారు స్థానిక సీఐ 8712670148, ఎస్ఐ 8712670187కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ నకిరేకంటి ధర్మా మంగళవారం కోరారు.

వడదెబ్బతో ప్రభుత్వ ఉద్యోగి మృతి



జానిబాబా (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: వడదెబ్బతో ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందాడు. మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురానికి చెందిన ఎం.డి.జానీబాబా(56) నల్లగొండలోని కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో డ్రైవర్ కం అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 13న బజారుకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అదే రోజు వడదెబ్బ గురై పాత సీతారాంపురం మధు బార్ వెనకాల పడిపోయాడు. అదే రోజు చనిపోగా కుటుంబ సభ్యుల వివరాలు తెలికపోవడంతో పోలీసులు ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచారు. అన్ని చోట్ల వెతికిన కుటుంబ సభ్యులు మంగళవారం పోస్టుమార్టం గదిని పరిశీలించగా జానీబాబా మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహం ఆచూకీ లభించడంతో పోలీసులు కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడు జానిబాబాకు భార్య నలుగురు కుమారులు, కుమార్తెలున్నారు. వడదెబ్బతో మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు.

మ్యానువల్ స్కావెంజర్ వ్యవస్థను తొలగించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దీపక్ తివారీ

సాక్షి,యాదాద్రి : మ్యానువల్ స్కావెంజర్ వ్యవస్థను పూర్తిగా తొలగించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మ్యానువల్ స్కావెంజర్స్, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయంలో ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొన్నా జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయంలో లేదా 7702252398 సంప్రదించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ, డీఆర్‌డీఓ, డీపీఓ, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, అంతకుముందు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డితో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పమేలా సత్పతి, డీసీపీ రాజేష్ చంద్ర, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ పాల్గొన్నారు.

ప్రతిభను చాటుకోవాలి

బీబీనగర్: మండలాల్లో నిర్వహిస్తున్న సీఎం కప్-2023 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకొని ప్రతిభను చాటుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. బీబీనగర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సీఎం కప్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. అనంతరం మన ఊరు మనబడిలో భాగంగా పాఠశాల గదులను ప్రారంభించారు. అలాగే రుద్రవెల్లి గ్రామంలోని కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుధాకర్‌గౌడ్, జెడ్పీటీసీ ప్రణీతాపింగళ్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మీ శ్రీనివాస్, తహసీల్దార్ అశోక్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీవాణి, ఏంఈఓ నాగవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

జేసీబీ వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం



వినయ్ మృతదేహం

బొమ్మలరామారం : జేసీబీ వాహనం ఢీ కొట్టడంతో ఓ యువకుడు దుర్మరణం చెందగా మరోకరు గాయాలపాలయ్యారు. ఈ సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చేల్ మల్కాజ్‌గిరి జిల్లా బాలాజీనగర్ గ్రామానికి చెందిన గుండ్లపురం వినయ్(19) తన స్నేహితుడు ఈసీఐఎల్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన కర్నకంటి లక్ష్మణ్‌తో కలసి స్కూటీపై వరంగల్‌లో బంధువుల పెళ్లికి వెళ్లారు. మంగళవారం వారు తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మండలంలోని రామస్వామితండా సమీపంలో ముందు వెళ్తున్న జేసీబీ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో వారు వెళ్లి జేసీబీని స్కూటీతో ఢీ కొట్టారు. దీంతో తీవ్రగాయాలైన గుండ్లపురం వినయ్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా కర్నకంటి లక్ష్మణ్‌కు గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా ఆసుపత్రి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

కోతుల దాడిలో బాలికకు గాయాలు



కోతుల దాడికి గురైన బాలిక

భువనగిరి : కోతులు దాడి చేయడంతో బాలికకు గాయాలైన సంఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పహాడీనగర్‌కు చెందిన ఎండీ నయీం కుమార్తె సాదిబా బేగం ఇంటి ఆవరణలో ఉండగా కోతుల గుంపు బాలికపై దాడి చేశాయి. బాలిక దివ్యాంగురాలు కావడంతో కోతుల దాడితో బాలికకు గాయాలయ్యాయి. బాలికను చికిత్స కోసం స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

అనుమతి లేని నిర్మాణాల తొలగింపు

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా చేస్తున్న నిర్మాణాలను మున్సిపల్ అధికారులు తొలగిస్తున్నారు. అందులో భాగాంగా పట్టణంలోని గాంధీపార్కు వద్ద ప్రధాన రహదారి పక్కన అక్రమంగా వేస్తున్న రేకుల షెడ్లను తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.నాగిరెడ్డి మాట్లాడారు. పట్టణంలో ఎవరైనా నిర్మాణాలు చేస్తున్న సమయంలో తప్పని సరిగా అనుమతి తీసుకోవాలన్నారు. వ్యాపార వాణిజ్య దుకాణదారులు రోడ్డుపైకివచ్చే విధంగా బోర్డులు, షెడ్లు వేస్తే చర్యలు తీసుకుటామన్నారు. రెండు, మూడు రోజు ల్లో పట్టణంలో దాడులు చేస్తామని ఆయన తెలి పారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



రేకుల షెడ్లు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యాయత్నం

చివ్వెంల(సూర్యాపేట) : పురుగుల మందుతాగి ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని జి.తిర్మగిరి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామశివారులోని చెరువు అలుగు పోసినప్పుడు గ్రామానికి చెందిన కొంతమంది రైతుల పొలాల నుంచి ప్రవహించి మోతె మండలం నామవరం చెరువులో కలుస్తాయి. ఈ క్రమంలో గ్రామానికి చెందిన పబ్బు నాగయ్య తన పొలంలో నుంచి వరద నీరు వెళ్లకుండా అదే వాగు దాటుకుంటూ ఇతర రైతులు పొలాలకు వెళ్లే చిన్న డొంకదారి వద్ద మట్టితో అడ్డుకట్ట వేశాడు. దీంతో కట్టకు అవతలి వైపు వరదనీరు ఆగిపోవడంతో పలువురు రైతులకు చెందిన సుమారు 60ఎకరాల్లో పొలాలు నీట మునుగుతున్నాయి. ఈ విషయాన్ని రైతులు గ్రామ సర్పంచ్‌కు ఫిర్యాదు చేయడంతో సర్పంచ్, మండల అధికారులతో మాట్లాడి మట్టి పోసిన వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపట్టాడు. విషయం తెలుసుకున్న నాగయ్య సంఘటనా స్థలానికి చేరుకుని ఇక్కడ నిర్మాణం చేపడితే తన పొలంపై వరద నీరు ప్రవహించి నష్టపోతానని, వెంటనే పనులు నిలిపివేయాలంటూ ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. గమనించిన రైతులు వెంటనే సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడు అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై సర్పంచ్ కంచర్ల నిర్మల గోవిందరెడ్డిని వివరణ కోరగా.. నాగయ్య పొలం వద్ద అడ్డుకట్ట వేయడంతో రైతుల పొలాలు నీట మునిగిపోతున్నాయని, దీనిపై అధికారులతో మాట్లాడి అక్కడ కల్వర్టు నిర్మాణం చేపట్టిందుకు నిధులు మంజూరు చేయడంతో స్థలాన్ని పరిశీలించేందుకు అక్కడకు వెళ్లగా నాగయ్య మందుతాగి ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించాడని తెలిపారు.

కాపురానికి రమ్మనందుకు భర్తపై దాడి

- కర్రతో తలపై కొట్టడంతో మృతి

దేవరకొండ : కాపురానికి తీసుకెళ్లేందుకు వచ్చిన భర్తపై భార్య దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలై భర్త మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. దేవరకొండ సీఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కొప్పరి కోటేశ్ (28)కు దేవరకొండ మండలం ఎల్లారెడ్డిబావికి చెందిన సువర్ణతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులున్నారు. కాగా ఈనెల 14న దంపతుల మధ్య గొడవ చోటు చేసుకోవడంతో సువర్ణ తనపిల్లలతో తల్లిగారి ఇంటికి వచ్చింది. అదే రోజు కోటేశ్ తన అక్క కొడుకు సింహాద్రితో కలిసి ఆటోలో భార్యను తీసుకొచ్చేందుకు అత్తగారి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో భార్యను కాపురానికి రావాల్సిందిగా కోటేశ్ కోరాడు. దీంతో సువర్ణ, కోటేశ్‌ల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో సువర్ణ, ఆమె అన్న గెల్వొయ్య కర్రతో కోటేశ్ తలపై కొట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. అక్కడే ఉన్న కోటేశ్ అక్క కొడుకు సింహాద్రి అతడిని ఆటోలో వైద్య చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కోటేశ్‌ను పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. సోమవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే కోటేశ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన తమ్ముడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి సోదరి ఎల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి తీవ్రగాయాలు



నాగారం : గాయపడిన నర్సింహస్వామి

నాగారం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని సూర్యాపేట-జనగామ జాతీయ రహదారిపై ప్రగతినగర్ వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాద నర్సింహస్వామి గ్రామం నుంచి తిరుమలగిరికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఈటూరు ఆవాసం ప్రగతినగర్ వద్ద గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అతడు కిందపడటంతో తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాధితుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కాగా ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చిట్యాల మండలంలో ముగ్గురికి..

చిట్యాల : మండలంలోని పెద్దకాపర్తి గ్రామశివారులో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకాపర్తి గ్రామానికి చెందిన గుండోజీ లింగస్వామి తన భార్య సుమలత, కూతురుతో గ్రామం నుంచి చిట్యాల వైపుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులోని కట్టమైసమ్మ గుడి వద్దకు రాగానే జాతీయ రహదారిపై నిలిపి ఉన్న లారీని అదుపు తప్పి వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

హుజూర్‌నగర్‌లో ఓ వ్యక్తికి గాయాలు..

హుజూర్‌నగర్ : పట్టణ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు కాగా ఓ గేదె మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. మిర్యాలగూడెం పట్టణానికి చెందిన షేక్ సందాని ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడు కోదాడ మండలం రామలక్ష్మీపురంలో ఏసీ మరమ్మతులు చేసేందుకు మరొకరితో కలిసి బైక్‌పై వెళ్తుండగా పట్టణ శివారులోని రామస్వామి గుట్ట సమీపంలో ఓ గేదె అకస్మాత్తుగా అడ్డురావడంతో గేదెను ఢీకొని కిందపడి పోయాడు. ఈ ప్రమాదంలో గేదె మృతి చెందగా, సందాని తలకు బలమైనగాయాలు కావడంతో రక్త స్రావమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించి స్థానికులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్య కోసం అతడిని ఖమ్మం తరలించారు.

కుటుంబ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య

నల్లగొండ క్రైం : కుటుంబ తగాదాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పట్టణంలోని దేవరకొండ రోడ్డులో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన మహమ్మద్ మోహినుద్దీన్(35) ల్యాబ్ టెక్నీషియన్ పని చేస్తున్నాడు. సాయంత్రం మోహినుద్దీన్ వివాహేతర సంబంధం విషయమై భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో బెడ్ రూమ్‌లోకి వెళ్లి తలుపు బిగించుకొని డోర్ కటన్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన భార్య 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి తలుపులు పగలగొట్టి చూడగా అప్పటికే మోహినుద్దీన్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ గోపి తెలిపారు.

దివ్యాంగ యువతులకు అండగా..

- 'గిఫ్ట్ ఏ స్మైల్' పథకం కింద వాహనం బహూకరించిన మంత్రి కేటీఆర్



వాహనాన్ని అందజేస్తున్న తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి


చౌటుప్పల్ : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామానికి చెందిన ఫ్లోరైడ్ బాధిత దివ్యాంగులైన ఇద్దరు అక్కాచెల్లెళ్లకు రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అండగా నిలిచారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటే వారు పడుతున్న ఇబ్బందులు తన దృష్టికి రావడంతో స్పందించి వాహనాన్ని సమకూర్చారు. గ్రామానికి చెందిన లందగిరి అంజయ్య కుమార్తెలైన రేణుక, సంధ్య ఫ్లోరైడ్‌తో కూడిన దివ్యాంగులు. సొంత పనులు చేసుకోవాలన్నా, ఇంటి నుంచి బయటికి వెళ్లాలన్నా వారిద్దరూ తీవ్ర ఇబ్బందులకు గురవుతారు. ఈ అక్కాచెల్లెళ్ల దీన పరిస్థితి కొద్దిరోజుల క్రితం తన దృష్టికి రాగా స్పందించారు. అందులో భాగంగా గిఫ్ట్ ఏ స్మైల్ కింద బ్యాటరీతో నడిచే త్రిచక్ర వాహనాన్ని సమకూర్చారు. ఆ మేరకు మంత్రి కార్యాలయం నుంచి వచ్చిన వాహనాన్ని మంగళవారం తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి యువతులకు అందజేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఆర్ఐ.సుధాకర్ ఉన్నారు.

వేసవిలో పాడి పశువుల యాజమాన్యం

- వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి
- నడిగూడెం పశువైద్యాధికారిణి డాక్టర్ అఖిల సూచనలు



షెడ్‌లో పెంచుతున్న గేదెలు



పాడి పంట

నడిగూడెం : ఎండలు మండుతున్నాయి. వడగాల్పులు కూడా వీస్తున్నాయి. రానురాను వేడి తీవ్రత మరింత అధికమయ్యే అవకాశం ఉంది. వేసవి తాపానికి మనుషులే కాకుండా పశువులూ ఇబ్బందులు పడాల్సివస్తుందని నడిగూడెం మండల పశువైద్యాధికారి డాక్టర్.అఖిల తెలిపారు. వేసవిలో పాడిపశువుల పోషణ కష్టంతో కూడుకున్నందున యాజమాన్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లేదంటే పాడి దిగుబడి తగ్గడంతో పాటు పశువులకు వడదెబ్బలాంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

వేసవి యాజమాన్యం..

ఏప్రిల్, మే నెలల్లో పగటి ఉష్ణోగ్రతలు 45డిగ్రీలకు పైగా నమోదయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచి పశుపోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి. పశువుల శరీరంలో నిరంతరం జరిగే జీవక్రియలు, పాల ఉత్పత్తి సమయంలో వేడి ఉత్పత్తి అవుతుంది. ఈ వేడిని నోటి ద్వారా, ఊపిరితిత్తుల ద్వారా, చెమట గ్రంధుల ద్వారా బయటకు పంపి పశువులు శరీర ఉష్ణోగ్రతను నియంత్రించుకుంటాయి. అయితే బయటి వేడి ఎక్కువగా పెరిగినప్పుడు ఉష్ణోగ్రతను నియంత్రించుకోవడం కష్టమవుతుంది. దీంతో అంతర్గత ఉష్ణోగ్రత బాగా పెరిగి అసహనం, అలసటకు గురై మూగజీవాలు నీరసించిపోతాయి. ఆకలి మందగిస్తుంది. శ్వాస తీసుకునే వేగం పెరుగుతుంది. గుండె కూడా వేగంగా కొట్టుకొని చివరకు సొమ్మసిల్లిపోయే ప్రమాదం ఉంటుంది. ఈ లక్షణాలను పాడి పశువుల్లో గుర్తిస్తే వడదెబ్బకు గురైనట్లు గుర్తించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

పశువులు వడదెబ్బ ప్రభావానికి గురికాకుండా చల్లటి వాతావరణం ఉండేలా వసతి ఏర్పాటు చేయాలి. పశువుల పాకలో వడగాలి బయటకు వెళ్లేలా ఉండాలి. అవసరమైతే ఫ్యాన్‌లు, స్ప్రింకర్లు ఏర్పాటు చేసుకోవాలి. పశువుల షెడ్డు వెలుపల నీడనిచ్చే చెట్లు పెంచుకోవాలి. గేదెలను ప్రతి రెండు గంటలకు ఒకసారి చల్లని నీటితో తడపాలి. మేత ఉదయం 9గంటల్లోపు సాయంత్రం5 గంటల తర్వాత ఇవ్వాలి. వేసవిలో పగలు కన్నా రాత్రి సమయంలో మేత ఎక్కువగా ఇవ్వడం మంచిది. తాగు నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి. ఎండుమేత తగ్గించి దాణా పెంచాలి.

తినగలిగినంత పచ్చిమేత ఇవ్వాలి..

పీచు పదార్థాలు ఎక్కువగా ఉండేలా ఎండు గ్రాసాలు మేపకూడదు. అత్యధిక పోషక విలువలు కలిగిన దాణా పెట్టాలి. పచ్చిమేత ఎక్కువగా అందించాలి. అలాగే షెడ్డు వెలుపల నీటిని చల్లుతూ ఉండాలి. షెడ్డుపైన ఆకులు లేదా పట్టాలు కప్పి నీటితో తడపాలి. లేదంటే పై భాగంలో నలుపు రంగు పేయింట్ వేయించాలి. షెడ్డు చుట్టూ పరదాలు కప్పి నీటితో తడపాలి. పశువులను కిక్కిరిసి ఉండేలా చేయకూడదు.

వేసవి తాపం లక్షణాలు..

- వేసవి తాపానికి సంకరజాతి పశువులు తట్టుకోలేవు. అలాగే నలుపు రంగు గేదెలు కూడా చాలా ఇబ్బంది పడతాయి.
- పశువు లేదా గేదెలు మేత తినడం తగ్గిస్తుంది. నీరు ఎక్కువగా తాగుతుంది. బరువు తగ్గిపోతుంది.
- పాల దిగుబడి తగ్గుతుంది. గర్భస్రావం కావచ్చు. సకాలంలో ఎదకు రావు.
- ఉష్ణోగ్రతను తగ్గించుకునేందుకు నోటి ద్వారా వేగంగా శ్వాసక్రియ జరుగుతుంది.
- నాలుక బయటపెట్టి నోటి నుంచి జిగురుగా సొంగ కారుస్తుంది. ఒక్కోసారి శ్వాస తీసుకోలేక పశువు చనిపోయే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి లక్షణాలు ఉంటే వేసవి తాపానికి గురైనట్లుగా భావించాలి.